క్లుప్తంగా

అందుబాటులోకి టెక్నాలజీ



శిక్షణ పొందుతున్న విద్యార్థినులు

ఖమ్మం సహకారనగర్: తమిళనాడులోని ఐసీటీ అకాడమీ మహిళా సాధికారిత కోసం 17 రోజులు పాటు కాగ్నిజెంట్ కంపెనీ ప్రతినిధులు సీఎస్ఆర్ ద్వారా సీఎస్‌సీ, ఈసీఈ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చారు. బుధవారం ఈ మేరకు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ జి.కృష్ణ మాట్లాడుతూ.. ఉద్యోగాలకు అవసరమయ్యే నూతన టెక్నాలజీని విద్యార్థులకు అందుబాటులో తీసుకురావాలనే ఉద్దేశంతో ఐసీటీ అకాడమీ ఆధ్వర్యాన శిక్షణనిచ్చామని తెలిపారు.

'ఉపాధి' పనులు పరిశీలన



మాట్లాడుతున్న అల్లిక వెంకటేశ్వరరావు

కూసుమంచి: మండలంలోని పెరికసింగారం గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధిహామీ పథకం పనులను బుధవారం పాలేరు నియోజకవర్గ బీఎస్పీ నాయకుడు డాక్టర్ అల్లిక వెంకటేశ్వరరావు సందర్శించారు. కూలీలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. పని ప్రదేశంలో సరైన వసతులకు లేక.. ఎండలకు కూలీలు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బహుజనులకు రాజ్యాధికారం రావాలంటే బీఎస్పీని బలపర్చాలని కోరారు.

'మోదీ పాలనలో దేశం విచ్ఛిన్నం'

నేలకొండపల్లి: మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే దేశాన్ని విచ్ఛిన్నం చేస్తారని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు బీ.వెంకట్ అన్నారు. బుధవారం మండలంలోని మంగ్రాజుపల్లిలో నిర్వహించిన సీపీఎం రాజకీయ శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పాలేరులో సీపీఎం జెండా ఎగరడం ఖాయమని అందుకు కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా నాయకుడు యర్రా శ్రీనివాసరావు, మండల కార్యదర్శి కే.వీ.రెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, గుడవర్తి నాగేశ్వరరావు, సిరికొండ ఉమామహేశ్వరి, శీలం అప్పారావు, పెద్దిరాజు నర్సయ్య, బెల్లం లక్ష్మి, ఇంటూరి అశోక్, దండా సూర్యనారాయణ, పగిడికత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆరెకోడులో పట్టుబడిన దొంగ?

ఖమ్మంరూరల్: మండలంలోని ఆరెకోడులో ఈనెల 13న రెండిళ్లల్లో చోరీకి పాల్పడిన నిందితుడు తాళం వేసి ఉన్న ఇళ్లను గుర్తించేందుకు బుధవారం మధ్యాహ్నం మళ్లీ వచ్చినట్లు తెలిసింది. బుల్లెట్ వాహనంపై ఆయన తిరుగుతుండగా అనుమానించిన గ్రామస్తులు పట్టుకుని రూరల్ పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. గతంలో మండలంలోని పలు గ్రామాల్లో వ్యవసాయ బావుల వద్ద ఉన్న విద్యుత్ మోటార్లు కూడా ఎత్తుకెళ్లడం, మళ్లీ ఇటీవల దొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

జర్నలిస్టులకు అండగా నిలుస్తాం..

ఖమ్మం మామిళ్లగూడెం: జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వచ్చే వరకూ అండగా ఉంటామని బీఎస్పీ ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అయితగాని శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. జర్నలిస్టులకు కేటాయించిన స్థలాన్ని బుధవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ తొలుత ఐదు ఎకరాల కేటాయించగా, ఆపై 23 ఎకరాలు ఇస్తున్నట్లు చెప్పారని పేర్కొన్నారు. కానీ నేటికీ పట్టాలు ఇవ్వలేదని, ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని కోరారు. పార్టీ నాయకులు చేకూరి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	46	బచ్చలికూర	2
వంకాయ	30		10
బెండకాయ	36	పాలకూర	3
పచ్చిమిర్చి	94		10
కాకర	56	చుక్కకూర	2
సొరకాయ	20		10
బీర	48	తోటకూర	2
దొండ	26		10
పొట్లకాయ	40	గోంగూర	2
చిక్కుడు	70		10
గోరుచిక్కుడు	46	మెంతికూర	5
క్యాబేజీ	18		20
క్యాలీఫ్లవర్	50	కొత్తిమీర	1
ఆలుగడ్డ	24		15
చామగడ్డ	46	పుదీన	1
క్యారెట్	56		15
క్యాప్సికం	60	-ఖమ్మం వ్యవసాయం	

వృత్తిదారులపై వివక్ష..!

మారని గీత కార్మికుల రాత..

- కల్లు గీత కార్మికులకు అందని రూ.లక్ష సాయం
- గత ప్రభుత్వ హయాంలో సబ్సిడీపై సైకిళ్లు, టీవీఎస్ మోపెడ్లు
- నేడు జాబితాలో లేకపోవడంతో పలువురి ఆగ్రహం
- గడువు పెంచి ఆదుకోవాలని వేడుకోలు



తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 9 నుంచి 20వ తేదీ వరకు బీసీ కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి రూ.1 లక్ష ఆర్థిక సాయం అందిస్తామని ప్రకటించి మార్గదర్శకాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అయితే ప్రభుత్వం సాయమందించే బీసీ కులాల జాబితాలో గీత కార్మికులు లేకపోవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్లు గీత వృత్తినే నమ్ముకొని జీవిస్తున్న వారిపై ప్రభుత్వం వివక్ష చూపడం సమంజసం కాదని బీసీ సంఘం, గీత కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు వాపోతున్నారు. మంగళవారంతో దరఖాస్తు గడువు ముగియడంతో ఏం చేయాలో తెలియక బీసీలోని మిగతా కులాల వారు తలలు పట్టుకుంటున్నారు.

నేలకొండపల్లి: తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించినప్పటికీ ప్రభుత్వం గీత కార్మికులపై వివక్ష చూపుతుందని గీత కార్మికులు మండిపడుతున్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్‌షాపులు వెలుస్తుండడంతో కల్లు గిరాకీ తగ్గిపోయి గీత వృత్తిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని గీతన్నలు వాపోతున్నారు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని పొట్టకూటి కోసం తాటిచెట్టు ఎక్కి కల్లు గీసుకుని బతికే తమకు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల ప్రమాద బీమా తప్ప ప్రభుత్వం మరి ఏ ఇతర సాయం అందడంలేదని చెబుతున్నారు. గత ఉమ్మడి ప్రభుత్వం హయంలో గీత కార్మికులకు సైకిళ్లు, టీవీఎస్ మోపెడ్లు వంటివి ఆదరణ పథకం కింద సబ్సిడీపై ఇచ్చారని గుర్తు చేస్తున్నారు. కానీ తెలంగాణ వచ్చాక.. గీత కార్మికుల రాత మారలేదని గీతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.లక్ష కోసం.. సవాలక్ష పాట్లు..

బీసీల్లో చేతి వృత్తిదారులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష సాయం కోసం ప్రజలు సవా లక్ష పాట్లు పడుతున్నారు. దరఖాస్తుకు కుల, ఆదాయ, ధ్రువీకరణ పత్రాలు జత చేయాల్సి ఉండగా.. వీటి కోసం మీ–సేవా, తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రతి రోజు పడిగాపులు కాయాల్సి వస్తోంది. వందల కొద్ది దరఖాస్తులు చేసుకునేందుకు వస్తుండడంతో ఆన్‌లైన్‌లో సాంకేతిక లోపాల కారణంగా సర్వర్ బీజీ వస్తోంది. దీంతో ఇచ్చిన గడువులోగా దరఖాస్తు చేసుకుంటామో లేదో? సాయం వస్తుందో రాదో తెలియక నానా తంటాలు పడ్డారు. మంగళవారంతో గడువు ముగియడంతో చాలా మంది అర్హులు దరఖాస్తు చేసుకోలేపోయారు. ప్రభుత్వ దరఖాస్తు గడువును పెంచి చేతి, కుల వృత్తిదారులను ఆదుకోవాలని పలువురు వేడుకుంటున్నారు.

పాలేరులో వేలాది మంది కార్మికులు..

పాలేరు డివిజన్‌లో నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మంరూరల్ మండలాలకు చెందిన గీత కార్మికులు ప్రభుత్వం ద్వారా 3,500 మంది సభ్యులు గుర్తింపు కార్డులు పొంది ఉన్నారు. ఇంకా ఉపాధి నమ్ముకొని, వృతి చేస్తూ గుర్తింపు కార్డులు పొందని వారు మరో 5 వేల మంది వరకు జీవిస్తున్నారు. అయితే వీరికి ప్రభుత్వం సాయం అందించేందుకు జాబితాలో పేరు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కల్లు విక్రయిస్తున్న ఇలా..

తీవ్ర అన్యాయం..



బీసీ కులాలకు రూ.1 లక్ష సాయం ఇచ్చే జాబితాలో గీత కార్మికులకు అవకాశం లేకపోవడం చాలా బాధకరం. వృత్తిదారులందరికీ రుణాలు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. జాబితాలో గీత కార్మికులను చేర్చలేని పక్షంలో ఆందోళన చేస్తాం.

– కాసాని సతీష్, జై గౌడ్ సంఘం కన్వీనర్

అందరికీ సాయమందించాలి..



బీసీ కులాలకు ఆర్థిక సాయం చేసే విషయంలో అన్ని కుల వృత్తిదారులు, కార్మికులకు అవకాశం కల్పించాలి. ప్రభుత్వం మరోమారు జాబితాను పునఃపరిశీలించి బీసీలోని అందరికీ అవకాశం కల్పించి ఆదుకోల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– రచ్చా నరసింహారావు, మాజీ ఎంపీపీ, నేలకొండపల్లి

గడువు పెంచితే బాగుంటుంది..



రాజకీయ జోక్యం లేకుండా బీసీ కులాలన్నింటికీ రుణాలు ఇవ్వాలి. సర్వర్ల డౌన్‌తో ఏర్పాడిన సాంకేతిక లోపాలతో చాలామంది దరఖాస్తు చేసుకోలేకపోయారు. ప్రభుత్వం ఇంకా గడువు పెంచి దిశగా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– జెర్రిపోతుల సత్యనారాయణ, బీసీ సంఘాల ప్రతినిధి, నేలకొండపల్లి

నెల రోజుల్లోగా పనులు పూర్తవ్వాలి



చేగొమ్మలో ఆరోగ్య ఉప కేంద్ర నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కందాల

కూసుమంచి/నేలకొండపల్లి: మన ఊరు–మన బడి పథకంలో భాగంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాలను నెల రోజుల్లోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కూసుమంచిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కూసుమంచి, తిరుమలాయపాలెం మండలాలకు చెందిన సర్పంచ్‌లు, హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్‌లతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయా మండలాల్లో భవనాల నిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలు ప్రారంభం నుంచే విద్యార్థులకు సమస్యలు లేకుండా చూడాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ బీవీ రామాచారి, పంచాయతీరాజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. అలాగే, మండలంలోని చేగొమ్మ గ్రామంలో రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న ఆరోగ్య ఉప కేంద్రానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ ఇంటూరి శేఖర్, సర్పంచ్ రమణమ్మ, ఎంపీటీసీ జ్యోతి, మెడికల్ ఆఫీసర్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా నేలకొండపల్లి మండలంలోని సదాశివాపురంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్‌కు, గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేసి వైంకుఠధామాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మరికంటి ధనలక్ష్మి, ఎంపీపీ వజ్జా రమ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శాంత, డీసీఎంఎస్ డైరెక్టర్ నాగబండి శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సొసైటీ చైర్మన్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నియామకం



శ్రీనివాసరెడ్డి(ఫైల్)

ఖమ్మంరూరల్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా రూరల్ మండలంలోని గోళ్లపాడుకు చెందిన ప్రముఖ న్యాయవాది, జిల్లా కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ మద్ది శ్రీనివాసరెడ్డిని తిరిగి రెండోసారి నియమిస్తూ బుధవారం పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తన మీద నమ్మకంతో తిరిగి ఈ బాధ్యతలు అప్పగించినందుకు శ్రీనివాసరెడ్డి ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

మరణించిన న్యాయవాదులకు వెల్ఫేర్ ఫండ్ ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న న్యాయవాది దిలీప్

ఖమ్మం లీగల్: తెలంగాణ బార్ కౌన్సిల్‌లో న్యాయవాదిగా నమోదై 35 ఏళ్ల దాటిన ప్రతీ న్యాయవాదికి తెలంగాణ రాష్ట్ర సహాయ నిధి ఇవ్వాలని తెలంగాణ బార్ కౌన్సిల్ కార్యదర్శికు బుధవారం ఖమ్మం న్యాయవాది దిలీప్ తాళ్లూరి వినతి పత్రం అందజేశారు. 2006 కంటే ముందు నమోదు చేయించుకుని 35 ఏళ్ల దాటిన న్యాయవాదులకి 2019లో సంక్షేమ నిధిలో అవకాశం కల్పించారన్నారు. కోవిడ్ సమయంలో కొంతమంది న్యాయవాదులు మరణించినా.. వారి కుటుంబాలకు ఎటువంటి సాయం అందలేదని, ఇకనైనా అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ లాయర్స్ అసోసియేషన్(ఐఏఎల్) జిల్లా కో కన్వీనర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

బీసీల రుణ గడువును పొడిగించాలి



మాట్లాడుతున్న కృష్ణమాచారి

ఖమ్మం మామిళ్లగూడెం: బీసీల రూ.లక్ష రుణ గడువును పొడిగించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రుణ గడువును పొడిగించాలని కోరుతూ ఖమ్మం ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్ ఎదుట బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దళిత బంధు, రైతు బంధుకు లేని ధ్రువపత్రాలు కులవృత్తులకు పెట్టడం ఎంతవరకు న్యాయమని, ఎటువంటి ధ్రువపత్రాలు లేకుండా రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. బీసీబంద్ ప్రకటించి బీసీలందరికీ రూ.10 లక్షలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ లింగబోయిన పుల్లారావు, చెన్నోజు పుల్లయ్య, చిటోజు రమేష్, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చెందరగిరి జనార్దనాచారి తదితరులు పాల్గొన్నారు.

పాత రిజర్వేషన్లనే కొనసాగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మోహన్

ఖమ్మం మామిళ్లగూడెం: మతం మారిన దళితులు, ముస్లింలకు రిజర్వేషన్లపై కేంద్రం కేజీ బాలకిషన్ కమిషన్ ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గకుండా పాత రిజర్వేషన్ల విధానాన్నే కొనసాగించేలా కేంద్రానికి నివేదిక ఇవ్వాలని ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు మారేడు మోహన్ డిమాండ్ చేశారు. ఖమ్మంలోని శృంగారపీఠం హాల్‌లో ఎస్సీ రిజర్వేషన్‌ల దుర్వినియోగంపై బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు పిడతల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉప్పల నర్సింహ, జి.అంబేడ్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రావణ్, నల్లగట్టు ప్రవీణ్‌కుమార్, సుదర్శన్ స్వర్ణాకర్, సురేష్, సాంబశివరావు, రాఘవులు, కృష్ణమోహన్, కొండల్, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎన్‌సీసీ శిక్షణ...



ఫైర్ విన్యాసాల్లో ఎన్‌సీసీ కేడెట్లు

కూసుమంచి: పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో 11వ బెటాలియన్, ఖమ్మం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఎన్‌సీసీ శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా బుధవారం ఫైర్ విన్యాసాలు, అగ్ని ప్రమాద సమయాల్లో తీసుకోవాల్సిన రక్షణ, సహాయ చర్యలు తదితర అంశాలపై కేడెట్లకు అవగాహన కల్పించారు. ఏఓ లెఫ్టినెంట్ కల్నల్ సునీల్‌యాదవ్ పర్యవేక్షణలో ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావు ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన కల్పించారు.

తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్



ట్రాన్స్‌కో కార్యాలయంలో జయశంకర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ఉద్యోగులు

తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం జయశంకర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. విద్యార్థి ఉద్యమ నాయకుడిగా, ప్రొఫెసర్‌గా తెలంగాణ ఉద్యమాన్ని ముందుకు నడిపించారని, ఆయన కలలు కన్న ప్రతీ ఆశయాను సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజాప్రతినిధులు పిలుపునిచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



తిరుమలాయపాలెం: బచ్చోడు చెరువు వద్ద యోగాసనాలు వేస్తున్న అధికారులు

ఎన్నో ఉపయోగాలు..

మండలాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాలయాలు, కార్యాలయాలు, యోగా శిక్షణ కేంద్రాలతో పాటు పలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు యోగా గురువులు వేసిన ఆసనాలను వేశారు. అనంతరం యోగా గురువులు యోగా ప్రాముఖ్యత, అందులోని మెళకువలను వివరించి యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు. ఈమేరకు యోగా సాధకులు వేసిన ఆసనాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



ఖమ్మం మామిళ్లగూడెం: పార్టీ జిల్లా కార్యాలయంలో యోగా చేస్తున్న బీజేపీ నేతలు



ఖమ్మం వైద్యవిభాగం/ఖమ్మం స్పోర్ట్స్: ప్రభుత్వ ఆస్పత్రిలో యోగా చేస్తున్న అధికారులు, వైద్యులు



కూసుమంచి: నవోదయలో యోగా చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



ఖమ్మంస్పోర్ట్స్: సర్దార్‌పటేల్ స్టేడియంలో యోగా చేస్తున్న దృశ్యం

వెలకట్టలేని సంపద 'యోగా'..

కలెక్టర్ వీ.పీ.గౌతమ్



యోగా చేస్తున్న కలెక్టర్ వీ.పీ.గౌతమ్

ఖమ్మం స్పోర్ట్స్: ప్రకృతిలో మమైకమై అన్ని రకాల క్రియలు మానవునికి దోహదపడే విధంగా యోగా వెలకట్టలేనిదని కలెక్టర్ వీ.పీ.గౌతమ్ అభివర్ణించారు. బుధవారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో క్రీడా శాఖ, ఆయుష్, ప్రజ్ఞాభారతి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం యోగా గురువులు చేస్తున్న ఆసనాలను కలెక్టర్ చేశారు. ఈసందర్భంగా యోగా గురువులు సతీష్, చినబాబులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ ఎం.పరంధామరెడ్డి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వేణుమనోహర్, డాక్టర్ కొలికొండ మహేంద్రకుమార్, పరుశురాం, ప్రసాద్, డాక్టర్ నర్సింహారావు, ప్రజ్ఞాభారతి సంస్థ నిర్వాహకులు సీహెచ్.రాజేంద్రప్రసాద్, క్రీడా శిక్షకులు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం..

ప్రధాన న్యాయమూర్తి జగ్జీవన్‌కుమార్



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మంలీగల్: నిత్యం యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందగలమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీఎస్ జగ్జీవన్‌కుమార్ అన్నారు. బుధవారం యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించిన యోగా శిబిరంలో ఆయన మాట్లాడారు. అనంతరం పాదం యోగా కేంద్రం ఆధ్వర్యాన న్యాయమూర్తులు, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది యోగా సాధన చేశారు. అలాగే, మరికంటి వెంకట్ రచించిన నవ్వుమాటలు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులు కె.ఉమాదేవి, ఎం.అర్చనకుమారి, వెంపటి అపర్ణ, డి.రాంప్రసాదరావు, ఎస్.అమరావతి, మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా, కె.ఆషారాణి, వి.మాధవి, ఆర్.శాంతిలత, బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మన్నెపల్లి బసవయ్య, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

పని ఒత్తిడికి సరైన పరిష్కారం..

డీఆర్‌డీఓ విద్యాచందన



యోగా చేస్తున్న డీఆర్‌డీఓ విద్యాచందన

తిరుమలాయపాలెం: ప్రస్తుతం ఉన్న పని ఒత్తిడికి యోగా మాత్రమే సరైన పరిష్కారం అని డీఆర్‌డీఓ విద్యాచందన అన్నారు. బుధవారం మండలంలోని బచ్చోడు పెద్ద చెరువు వద్ద నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా యోగా టీచర్ నగేష్ ఆధ్వర్యాన విద్యార్థులు, ఉపాధి కూలీలు, అధికారులకు యోగాసనాలు చేయించి యోగా ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ శిరీష, ఎంపీడీఓ జయరాం, డాక్టర్ వసుంధర, ఏపీఓ నర్సింహారావు, గాలయ్య, ఈ.సీ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ఆధ్యాత్మిక వేడుకలు

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బుధవారం పలు ఆలయాల్లో ఆధ్యాత్మిక దినోత్సవ వేడుకలను సంప్రదాయ పద్ధతుల్లో వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణంతో పాటు హోమాలు, అభిషేకాలు వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలో పాల్గొన్నారు.

– ఖమ్మంగాంధీచౌక్/ఖమ్మంరూరల్/నేలకొండపల్లి



ఖమ్మంరూరల్: రెడ్డిపల్లిలోని మారెమ్మతల్లి ఆలయంలో యాగం నిర్వహిస్తున్న అర్చకులు



ఖమ్మంగాంధీచౌక్: శ్రీ గుంటు మల్లేశ్వరస్వామి ఆలయంలో హోమం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు



నేలకొండపల్లిలో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



కాల్వొడ్డులోని శ్రీ సత్యనారాయణ సహిత దేవస్థానంలో పూజలు చేస్తున్న భక్తులు